క్లుప్తంగా

వచ్చే నెల 16న విజయ బేతాళ స్వామి ఉత్సవం



అంబాజీపేటలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సంఘ అధ్యక్షుడు రామారావు

అంబాజీపేట: విజయదశమిని పురస్కరించుకొని అంబాజీపేట, మాచవరం అభ్యుదయ శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వచ్చే నెల 16వ తేదీన విజయ బేతాళ స్వామివారి వాహన ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు దొమ్మేటి వెంకట రామారావు, ఉత్సవ కమిటీ చైర్మన్ శీలం సత్య అర్జున మోహనరావు, సంఘ సభ్యులు తెలిపారు. అంబాజీపేట సంఘ కళ్యాణ మండపం భవనంలో సంఘ సమావేశం కార్యదర్శి మట్టపర్తి రాము అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ వచ్చే నెల 3వ తేదీన స్థానిక పెద్ద వీధిలో ఉన్న బేతాళ స్వామి ఆలయం వద్ద కలశ స్థాపన జరుగుతుందన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు దొమ్మేటి శ్యామ్, విత్తనాల ఇంద్రశేఖర్, దొమ్మేటి సత్య మోహన్, బొంతు పెదబాబు, గుత్తుల పండు, జాయింట్ సెక్రటరీ మట్టపర్తి సత్యనారాయణ, దొమ్మేటి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల దీక్షకు పలువురి సంఘీభావం



దీక్షకు సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎంపీపీ లింగోలు

మలికిపురం: స్థానిక డిగ్రీ కళాశాల అధ్యాపకులు చేపట్టిన నిరసన దీక్షకు ఆదివారం పలువురు సంఘీభావం తెలిపారు. జీతాల కోసం గత 12 రోజుల నుంచి సిబ్బంది చేస్తున్న పోరాటానికి సఖినేటిపల్లి మండల మాజీ ఎంపీపీ లింగోలు మహాలక్ష్మి(చిన్నబ్బులు), సఖినేటిపల్లి మాజీ సర్పంచ్ రావి ధర్మరాజు, సెవెన్ హిల్స్ స్కూల్ కరస్పాండెంట్ డీఆర్ఎల్ రామలింగరాజు, నల్లి శివకుమార్, బల్ల కిరణ్‌కుమార్, ఎర్రంశెట్టి సత్యనారాయణ, చవ్వాకుల సూర్యప్రకాశరావు శిబిరాన్ని సందర్శించి అధ్యాపకులకు మద్దతు ప్రకటించారు.

వ్యక్తి అదృశ్యం

అంబాజీపేట: ఇంటి నుంచి వెళ్లిపోయిన ఓ వ్యక్తిపై అదృశ్యం కేసు నమోదు చేసినట్లు అంబాజీపేట పోలీసులు తెలిపారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం చిరతపూడి ఎస్ఎస్ నగర్‌కు చెందిన 58 ఏళ్ల మానుకొండ నాగేశ్వరరావు ఈ నెల 6వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతడి కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం కనిపించలేదు. దీంతో ఈ నెల 21వ తేదీ రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాగేశ్వరరావు భార్య నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ జేజీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన జిల్లా ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘ కార్యవర్గం

మలికిపురం: జిల్లా ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. మండలంలోని గూడపల్లిలో జరిగిన కార్యవర్గ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎస్‌వీ రమణారావు, కార్యదర్శిగా టీఎస్ఆర్ అయ్యప్పనాయుడు, కోశాధికారిగా నూలు శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. అలాగే రాజోలు డివిజన్ అధ్యక్షుడిగా జి.రత్నరాజు, కార్యదర్శిగా పోతురాజు చిన్న, కోశాధికారిగా కె.కిరణ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కె.తులసీ విష్ణు ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

పి.గన్నవరం: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మండలంలోని నాగుల్లంక గ్రామంలో సర్పంచ్ యల్లమెల్లి కృష్ణవేణి అధ్యక్షతన ఆదివారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 100 రోజుల పాలనలో ఎన్నో మంచి పనులు చేశామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శివశంకర ప్రసాద్, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీడీఓ ఎం.భారతి, నామన రాంబాబు, శిరిగినీడి వెంకటేశ్వరావు, వాసంశెట్టి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పవన్ దీక్షకు మద్దతుగా ..

మామిడికుదురు: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా ముగ్గురు జనసేన నేతలు ఆదివారం 11 రోజుల దీక్ష చేపట్టారు. అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి ఆలయంలో పూజల అనంతరం పాశర్లపూడి ఉప సర్పంచ్ తుండూరి బుజ్జి, అప్పనపల్లికి చెందిన సీనియర్ నేత కంకిపాటి నర్సింహరావు, జనసేన మండల యూత్ అధ్యక్షుడు బళ్ల సతీష్ దీక్ష ప్రారంభించారు.

ప్రతిపాదనలు పట్టాలెక్కేనా!

- కాగితాలకే పరిమితమైన ఆత్రేయపురం శివాలయ పునరుద్ధరణ పనులు
- దేవదాయశాఖ అధికారుల అలసత్వంపై భక్తుల ఆవేదన

ఆత్రేయపురం: సుమారు నాలుగు శతాబ్దాల నాటి ఆత్రేయపురం బాలాత్రిపుర సుందరీ సమేత రాజ రాజేశ్వరి స్వామి(శివాలయం) దేవాలయ పునరుద్ధరణ పనులు ప్రతిపాదనల దశలోనే నిలిచిపోయాయి. రూ.80 లక్షలతో ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి మూడేళ్ల క్రితం ప్రణాళికలు రచించి ఉన్నతాధికారులకు పంపించారు. ఆ మేరకు నిధులు సైతం మంజూరయ్యాయి. అయితే దేవదాయ శాఖ అధికారుల అలసత్వంతో పనులు జరగక నిధులు మళ్లీ వెనక్కి మళ్లాయి. దీంతో ప్రతిపాదనలేవీ పట్టాలెక్కకుండా కాగితాలకే పరిమితమైపోయాయి. దీనిపై భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలోనే పురాతనమైన ఆలయంగా పేరుగాంచిన ఆత్రేయపురం శివాలయం శిథిలావస్థకు చేరుకుంది. అదే ప్రాంగణంలో ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయం సైతం శిథిలస్థితికి చేరింది. ఈ రెండు ఆలయాలు అత్రి మహర్షి దర్శించిన ఆలయాలుగా ప్రసిద్ధి గాంచాయి. ఒకప్పుడు సముద్రం, గోదావరి నదులు కలిసి ఉన్న ప్రాంతంలో అత్రి మహర్షి నివసించేవారని, ఆయన రోజూ గోదావరిలో స్నానం ఆచరించి ఈ ఆలయంలో స్వామివారికి పూజలు నిర్వహించేవారని ప్రతీతి. అత్రి మహర్షి సంచరించిన ప్రాంతం కావడంతో ఈ ప్రాంతానికి ఆత్రేయపురం గ్రామం అనే పేరు వచ్చిందని ఇక్కడ ప్రజల విశ్వాసం. అందుకు జ్ఞాపకంగా ఆత్రేయపురం రావిచెట్టు వద్ద శివాలయానికి సమీపంలో అత్రి మహర్షి విగ్రహాన్ని సైతం ఏర్పాటు చేయడం గమనార్హం.



శిథిలావస్థలో ఉన్న ఆత్రేయపురం శివాలయం



ప్రత్యేక అలంకరణలో బాలా త్రిపుర సుందరీ సమేత రాజరాజేశ్వరస్వామి

నామమాత్రంగా ఉత్సవాలు

ఈ ఆలయానికి నాటి పెద్దాపురం సంస్థానాధీశులు తిమ్మ జగపతిరాజు సుమారు 50 ఎకరాల భూమిని పూజల నిమిత్తం అందించారు. అందులో కొన్ని భూములు బలహీన వర్గాల నిర్మాణం కోసం ప్రభుత్వాలు పట్టాలుగా పంపిణీ చేశాయి. మిగిలిన భూముల ద్వారా ఆదాయం వస్తున్నా ఆలయ మరమ్మతులు, కల్యాణం తదితర ఉత్సవాలకు సైతం నామమాత్రంగానే నిధులు ఇస్తున్నారు. ఒకప్పుడు కోనసీమలోనే అత్యంత వైభవంగా కల్యాణోత్సవాలు నిర్వహించేవారు. కాలక్రమేణా ఆలయానికి ఆదాయం తగ్గడంతో నామమాత్రంగా ఉత్సవాలు, సేవలు నిర్వహిస్తున్నారు. ఆలయం మొత్తం శిథిలస్థితికి చేరడంతో పాటు ఆలయం పల్లంలో ఉండడంతో నీరు నిల్వ ఉండటంపై భక్తులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పురాతన ఆలయాలను పునరుద్ధరించడానికి దేవదాయ శాఖ అధికారులు పూనుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ ఆలయాల పునరుద్ధరణకు నిధులు మంజూరు చేసి పనులు జరిగేలా చూడాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ఆలయ పునరుద్ధరణకు పూనుకోవాలి



ఆత్రేయపురం శివాలయం పురాతనమైన ఆలయం. పైగా అత్రి మహర్షి తపస్సు చేసిన ప్రాంతంలో ఉండటం వల్ల చాలా శక్తివంతమైన ఆలయంగా భక్తుల విశ్వాసం. ఆలయ పునరుద్ధరణకు అధికారులు నిధులు మంజూరు చేయించి యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ పనులు చేపట్టాలి.

– సాగిరాజు సూర్యతేజ, ఆత్రేయపురం, భక్తుడు

నిధులు మంజూరు కావాలి



ఆత్రేయపురం శివాలయం పునరుద్ధరణకు దేవదాయ శాఖ వద్ద ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయి. అయితే నేను విధుల్లో చేరాక నిధులు మంజూరు కాలేదు. నిధులు రాగానే పునరుద్ధరణ పనులు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నాం.

– బి.నరేంద్రకుమార్, గ్రూప్ టెంపుల్స్ ఈఓ

రహదారి పూర్తి చేయాలంటూ వేడుకోలు

అయినవిల్లి: మండలంలోని మాగం గ్రామంలోని సాకలిపాలెం వద్ద సచివాలయానికి వెళ్లే సీసీ రోడ్డును అసంపూర్తిగా నిర్మించారు. ఈ మార్గంలో డ్రెయినేజీ ఉండటంతో కాంట్రాక్టర్ సిమెంట్ తూరలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే అక్కడ సిమెంట్ తూరలు వేయకుండా సుమారు 50 అడుగుల మేర సీసీ రోడ్డు నిర్మించకుండా వదిలేశారు. దీంతో వాహన చోదకులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షకాలంలో ఇక్కడ బురదగా మారి తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. డ్రెయినేజీకి సిమెంట్ తూరలు ఏర్పాటు చేసి సీసీ రోడ్డును పూర్తి చేయాలని స్థానికులు పంచాయతీరాజ్ అధికారులను కోరుతున్నారు.

బాధ్యులపై చర్యలు చేపట్టాలి

సఖినేటిపల్లి: తిరుపతి లడ్డూ విషయంలో విచారణ చేసి బాధ్యులపై చర్యలు చేపట్టాలని ఆదివారం మోరిపోడుకు చెందిన సామాజిక కార్యకర్త ముత్యాల శ్రీనివాసరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తక్షణం చర్యలు తీసుకుని భక్తుల మనోభావాలను పరిరక్షించాలని ఆయన కోరారు.

లడ్డూ పవిత్రతను కాపాడాలంటూ ప్రదర్శన

పి.గన్నవరం: తిరుమల శ్రీవారి లడ్డూ పవిత్రతను కాపాడాలని డిమాండ్ చేస్తూ ఆదివారం పి.గన్నవరంలో విశ్వహిందూ పరిషత్, బజరంగదళ్ కార్యకర్తల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అక్విడెక్టు కాలనీ నుంచి మూడు రోడ్ల సెంటర్ వరకూ ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు పాల్గొన్నారు.

అన్న సమారాధనలు.. ఊరేగింపులు

అంబాజీపేట: గణపతి నవరాత్రులను పురస్కరించుకుని మండలంలో గణేష్ మండపాల వద్ద ఆదివారం భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. మాచవరం పంచాయతీ కార్యాలయ సమీపంలో ఉన్న శ్రీయువ గణపతి ఆలయం వద్ద, చిరతపూడి శివారు కడలివారిపాలెంలో వరసిద్ధి వినాయక స్వామివారి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన చేశారు. అనంతరం స్వామివారి లడ్డూను వేలం నిర్వహించారు. బైబై గణేషా అంటూ పురవీధుల్లో గణపతిని ఊరేగిస్తూ నిమజ్జనం చేశారు. అంతకుముందు మాచవరంలో శ్రీయువ గణపతి స్వామి వారిని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

పి.గన్నవరం: స్థానిక కొత్త అక్విడెక్టుకు ఎల్.గన్నవరం వైపున పార్కులో వేంచేసియున్న లక్ష్మీగణపతి స్వామివారి ఆలయం వద్ద గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలో ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని స్థానిక విజయ గణపతి ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున అన్నసమారాధన చేశారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు.

ధర్మాచార్యులుతో పాలకమండలి ఏర్పాటు చేయాలి

రావులపాలెం: హిందూ దేవాలయాల వ్యవస్థ నిర్వహణ, పర్యవేక్షించేందుకు హిందూ ధర్మాచార్యులతో కూడిన పాలకమండలి ఏర్పాటు చేయాలని ప్రగతి భారతమ్ ట్రస్ట్ అధ్యక్షుడు తమలంపూడి రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి నియామకంలో, పరిపాలనలో తుది నిర్ణయం ధర్మాచార్య మండలికే ఉండేలా రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ చట్టాలను సవరించాల్సిందిగా కోరుతున్నామన్నారు. టీటీడీ లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేయించి దోషులను శిక్షించాలన్నారు.

రఘురామకృష్ణంరాజుపై అట్రాసిటీ కేసు పెట్టాలి



అంబాజీపేట పోలీస్‌స్టేషన్‌లో రఘురామకృష్ణంరాజుపై ఫిర్యాదు చేస్తున్న దళిత నాయకులు

అంబాజీపేట: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని అంబాజీపేట మండల దళిత నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక బస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాళ్ల మండలం ఏలూరుపాడులో రఘురామకృష్ణంరాజు అంబేడ్కర్ ఫ్లెక్సీని తొలగించడం క్షమించరాని నేరమని, ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే అయనను టీడీపీ నుంచి సస్పెండ్ చేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసనలో భాగంగా ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు దిష్టిబొమ్మను తగులబెట్టారు. ఈ సందర్భంగా పలువురు దళిత నాయకులు మాట్లాడుతూ మొదటి నుంచి రఘురామకృష్ణంరాజు దళితులపై అక్కసు వెళ్లగక్కుతున్నారన్నారు. ఆయనపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. ఒక ఎమ్మెల్యేగా అందరినీ సమానంగా, సోదర భావంతో చూస్తానని ప్రమాణ స్వీకారం చేసి ఇలాంటి కార్యక్రమాల్ని ప్రోత్సహించడం దురదృష్టకరమన్నారు. అనంతరం రఘురామకృష్ణరాజుంపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, తక్షణమే ఆరెస్ట్ చేయాలని అంబాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నెల్లి వెంకటరమణ, నూకపెయ్యి చిన్న, గోసంగి సత్యనారాయణ, కొల్లి శ్రీనివాస్, కోట సత్తిబాబు, నాగవరపు నాగరాజు, కోట హనుమంతరావు, బీర సురేష్, గోసంగి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



రామేశ్వరం సెంటర్‌లో ఆందోళన చేస్తున్న దళిత నాయకులు

ఉండి ఎమ్మెల్యేపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి


సఖినేటిపల్లి: మండల పరిధిలోని రామేశ్వరం సెంటర్‌లో ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత నేతలు డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు పాడులో డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని అవమానించిన ఎమ్మెల్యే వైఖరికి నిరసనగా ఆదివారం మాజీ సర్పంచ్ సరెళ్ల విజయ్ ప్రసాద్ ఆధ్వర్యంలో దళిత నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి వారు క్షీరాభిషేకం చేశారు. రఘురామకృష్ణంరాజు ఒక ప్రజాప్రతినిధి అయి ఉండి అంబేడ్కర్ ఫ్లెక్సీ చింపి అవహేళనగా మాట్లాడడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో పలువురు దళిత ప్రతినిధులు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీని అరెస్టు చేయాలి

ఆలమూరు: కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలోని ప్లేగ్రౌండ్‌లో వాలీబాల్ క్రీడకు అనుమతి ఇవ్వలేదని తన అనుచరులతో కలిసి ప్రొఫెసర్ డాక్టర్ మహేశ్వరరావుపై దాడి చేసిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీని వెంటనే అరెస్టు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జనుపల్లి సత్తిబాబు, పి.వెంకట్‌రాయుడు డిమాండ్ చేశారు. ఆలమూరులో ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ దాడి ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ప్రొఫెసర్‌ను చంపేస్తామని బెదిరించడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం సత్వరమే స్పందించి చట్ట ప్రకారం నానాజీపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే నానాజీ తన చిత్తశుద్ధిని నిరూపించుకోకపోతే వైద్యులు, విద్యార్థులతో కలిసి భారీ ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.

అంతర్వేదికరలో ర్యాలీ

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదికర గ్రామంలో ఆదివారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పోతురాజు నరసింహారావు ఆధ్వర్యంలో ప్రధాన రహదారి వెంబడి స్వచ్ఛతాహి ర్యాలీ జరిపారు. ర్యాలీలో వైద్యారోగ్య, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



సర్పంచ్ నరసింహారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛతాహి సేవ ర్యాలీ

పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం-కోటిపల్లిరేవులో పేకాట ఆడుతున్న ఐదుగురిని ఎస్ఐ కె.మనోహర జోషి ఆదివారం రాత్రి అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఆదివారం రాత్రి ముక్తేశ్వరం-కోటిపల్లిరేవులోని పేకాట శిబిరంపై దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.4,050 స్వాధీనం చేసుకున్నారు. నిందితులను సోమవారం కోర్టుకు తరలించనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వరద బాధితులకు రూ.40 వేల సాయం



రాజోలు ఎమ్మెల్యే వరప్రసాద్‌కు చెక్కు అందజేస్తున్న చైర్మన్ సత్యనారాయణ

మామిడికుదురు: విజయవాడ వరద బాధితుల సహాయనిధికి మామిడికుదురు దీప్తి, నగరం సాయిదీప్తి విద్యా సంస్థలు ఆదివారం రూ.40 వేలు సహాయం అందించాయి. విద్యా సంస్థల చైర్మన్ డీవీవీ సత్యనారాయణ, సాయిదీప్తి ప్రిన్సిపాల్ జక్కంపూడి శివప్రసాద్ రూ.40 వేలు చెక్కును రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో దీప్తి, సాయిదీప్తి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు యక్కలదేవర నాగన్నబాబు, గుబ్బల మౌనిక, జక్కంపూడి బాబి, గుండుబోగుల పెదకాపు, పినిశెట్టి బుజ్జి పాల్గొన్నారు.

ఇది మంచి ప్రభుత్వం

అయినవిల్లి: మండలంలోని వెలువలపల్లిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు బడుగు భాస్కర్ జోగేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుభవం కలిగిన చంద్రబాబు, రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా భావించే పవన్‌కళ్యాణ్‌ల నాయకత్వాన్ని ప్రజలు విశ్వసించి గెలిపించారన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. కార్యక్రమంలో అందే సత్యనారాయణ, చింతా వనములరావు, నిల్లా సూర్యనారాయణ, బడుగు వెంకటేష్, పరమట నాని, మేడిశెట్టి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

ఆత్రేయపురం: వాసవి ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం మండలాల్లో ఉన్న 141 మంది ఆర్యవైశ్య పేద విద్యార్థులకు రూ.6.24 లక్షల మేర ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో వాసవి ఎడ్యుకేషన్ ట్రస్ట్ సభ్యులు, నియోజకవర్గ ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

ఆర్‌సీఎం చర్చి ఫాదర్‌కు డాక్టరేట్ ప్రదానం

యానాం: యానాం పట్టణ రోమన్ కేథలిక్ చర్చి ఫాదర్ పాలమరిశెట్టి మరియదాసుకు ఆంధ్రా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆయన 'విపత్తుల నిర్వహణ, ప్రాణ–ఆస్తి నష్ట నివారణకు తోడ్పడిన అంశాలు' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ కామర్స్ విభాగం అధిపతి ఎ.నరసింహారావు చేతుల మీదుగా డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.

శ్రీరాముడి జీవితం అందరికీ ఆదర్శప్రాయం



ప్రవచనాలు నిర్వహిస్తున్న శ్రీనివాస రామానుజదాసు

అంబాజీపేట: రామాయణం ఒక గొప్ప కావ్యమని, శ్రీరాముడి జీవన విధానం అందరికీ ఆదర్శప్రాయమని గుంటూరు జిల్లా నంబూరుకు చెందిన కాశీ వన ఆశ్రమానికి చెందిన చంద్రకాశీ ప్రసాద్ మాతాజీ శిష్యులు శ్రీనివాస రామానుజదాసు చెప్పారు. అంబాజీపేట పెద్ద వీధిలో ఉన్న ఏవీఆర్ గ్రాండ్ ఏసీ కళ్యాణ మండపంలో శ్రీమద్రామాయణ ప్రవచనాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రామానుజదాసు మాట్లాడుతూ శ్రీరామచంద్రుడు ధర్మపరాయణుడిగా పేరుగాంచిన గొప్ప రాజనీతిజ్ఞుడన్నారు. పితృవాక్య పరిపాలకుడు, ఒకే మాట, ఒకే బాణం, ఒకే భార్యగా కీర్తిగాంచిన సద్గుణ సంపన్నుడన్నారు. శ్రీరాముడి వల్ల రఘువంశ కీర్తి ప్రతిష్ఠలు ఎంతగానో పెరిగాయన్నారు. అరణ్యవాసం చేస్తున్న సమయంలో అయోధ్య ప్రజలు రాముని సేవలో తరించేందుకు బ్రహ్మచర్యం పాటించారన్నారు. రామరావణ యుద్ధంలో కూడా శ్రీరాముడు యుద్ధ ధర్మం పాటించాడని, ఆయుధాలు లేకుండా అచేతనంగా ఉన్న రావణాసురుడిని క్షమా గుణంతో వదిలి పెట్టి మర్నాడు రమ్మని చెప్పడం రామునికే చెల్లిందన్నారు. తొలుత ప్రవచన కార్యక్రమ నిర్వాహకులు అప్పన రవికుమార్, రేవతి దంపతుల స్వగృహంలో విష్ణు సహస్ర నామ పారాయణ, రామరక్షా స్తోత్రం, నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా ఈ ప్రవచనాలు ఈ నెల 29 వరకూ కొనసాగుతాయని నిర్వాహకులు రవికుమార్ దంపతులు తెలిపారు.

శ్రీకృష్ణుడు సూచించిన ధర్మ మార్గంలోనే నడవాలి

అయినవిల్లి: ప్రతిఒక్కరూ శ్రీకృష్ణుడు సూచించిన ధర్మ మార్గంలో నడవాలని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాసదాస్ అన్నారు. ఆదివారం అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్‌లో శ్రీకృష్ణుడికి ఆయన ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆయన భక్తులకు శ్రీకృష్ణుని తత్వం బోధించారు. శ్రీకృష్ణుని లీలామృతాన్ని పారాయణం చేశారు. బొక్కా రవితేజ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో ప్రభూపతి దాసు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణుని తత్వం బోధిస్తున్న సుందర శ్రీనివాస్‌దాస్

27న పి.గన్నవరంలో మెగా జాబ్ మేళా



పి.గన్నవరంలో మెగా జాబ్ మేళా పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ ఉదయం పి.గన్నవరంలోని గ్రేస్ విద్యాసంస్థల ఆవరణలో నియోజకవర్గ స్థాయిలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ జాబ్ మేళాకు 18 కంపెనీల ప్రతినిధులు వస్తున్నారని వివరించారు.పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ, బీటెక్ చదివిన నిరుద్యోగ యువతకు భారీ స్థాయిలో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఎమ్మెల్యే సత్యనారాయణ ఆవిష్కరించారు. సమావేశంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, శిరిగినీడి వెంకటేశ్వరావు, వాసంశెట్టి కుమార్, సాధనాల వెంకట సత్యనారాయణ, యర్రంశెట్టి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుమారుడి చికిత్స కోసం ఆర్థిక సాయం

రాజోలు: లుకేమియా వ్యాధితో చికిత్స పొందుతున్న స్నేహితుడి కుమారుడికి చిన్ననాటి మిత్రులు అండగా నిలిచారు. కడలి గ్రామానికి చెందిన నాలుగో తరగతి విద్యార్థి వడ్డి ఆయుష్‌కుమార్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స నిమిత్తం రూ.9 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. ఆయుష్‌కుమార్ తండ్రి మలికిపురం మండలం కేశనపల్లి ఉన్నత పాఠశాలలో 2009–10 సంవత్సరంలో పదో తరగతి వరకూ చదువుకున్నారు. దీంతో చిన్ననాటి మిత్రులంతా తలో చేయి వేసి స్నేహితుడి కుమారుడి వైద్యం కోసం రూ.35 వేలు ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు.



ఆర్థిక సాయం అందిస్తున్న 2009-10 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

గణపతి లడ్డూ రూ.63,500



మాచవరంలో గణపతి లడ్డూను పాటదారులకు అందిస్తున్న కమిటీ సభ్యులు

అంబాజీపేట: మాచవరం పంచాయతీ సమీపంలో వేంచేసియున్న యువ గణపతి ఆలయం వద్ద స్వామివారి లడ్డూను వేలం నిర్వహించగా అంబాజీపేటకు చెందిన కాసు వెంకట నాగభద్రం, గౌరీ మహాలక్ష్మి కుమారులు నాగేంద్ర, ఫణీంద్రలు రూ.63,500కు దక్కించుకున్నారు. అంతకుముందు స్వామివారికి గరిక పూజ నిర్వహించారు. అన్నసమారాధన చేపట్టారు. అనంతరం గణపతిని పురవీధుల్లో ఊరిగిస్తూ నిమజ్జనం చేశారు. వేలంలో దక్కించుకున్న స్వామివారి లడ్డూను మేళతాళాలతో నాగేంద్ర, ఫణీంద్రలకు ఆలయ కమిటీ సభ్యులు అప్పగించారు.